E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

21-04-2025 సోమవారం | పేజీలు–6 | హైదరాబాద్ | ekaburu.com



అమెరికాపై మాకు 'నమ్మకం' లేదు!

4లో

# జపాన్లోని కితాక్యూషూ నగరాన్ని సందర్శించిన సీఎం



- జపనీస్ భాషా పాఠశాల కోసం చర్చలు
- పర్యావరణంలో కితాక్యూషూ మార్పు
- క్లీన్ హైదరాబాద్ కోసం ఒప్పందాలు
- మూసీ ప్రక్షాళనపై సీఎం దృష్టి
- ప్రవాసుల పాత్రకు రేవంత్ పిలుపు
- హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యం
- జపాన్ టూర్‌లో ఇండస్ట్రియల్ భాగస్వామ్యాలపై

**ఈ కబురు,**: జపాన్లో పర్యటిస్తున్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కితాక్యూషూ మేయర్ను కలుసుకున్నారు. నగర మేయర్ కజుహిసా టకేచీ గారు తెలంగాణ బృందాన్ని అక్కడి సాంప్రదాయ రీతిలో ఘనంగా స్వాగతించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మరియు అధికారులకు మేయర్ స్వాగతం పలికారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్యంతో ఉన్న నగరం కితక్యూషూ. గాలి, నీరు, నేల విషపూరితంగా ఉండేవి. ఇప్పుడు ఈ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది.రాష్ట్ర అభివృద్ధిలో మూసీ నది ప్రక్షాళన కీలకమని సీఎం రేవంత్ రెడ్డి జపాన్లో ని టోక్యోలో జరిగిన 'జపాన్ తెలుగు సమాఖ్య' సమావేశంలో చెప్పారు. గుజరాత్‌లో సబర్మతి, వారణాసిలో గంగా, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్‌ల స్ఫూర్తితో తెలంగాణలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు.చెరువు మధ్యలో ఉన్న నిర్మాణాలను చూస్తూ ఊరుకుందామా అని ప్రశ్నించారు. వాటిని కూల్చకపోతే ప్రకృతి క్షమించదన్నారు. యూఎస్‌లో హడ్సన్, లండన్‌లో థేమ్స్, సియోల్‌లోని నదులను స్వయంగా చూసిన అనుభవాన్ని ఆయన పంచుకున్నారు. హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలంటే మూసీ నదిని కాలుష్య రహితంగా మార్చాలని తెలిపారు. హైదరాబాద్ను ప్రపంచ స్థాయి నగరాలైన న్యూయార్క్, టోక్యో, లండన్‌తో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలంటే ప్రవాస తెలుగువాళ్ల సహకారం, ఆలోచనలు కీలకమని, సొంత రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం అపూర్వమైందని సీఎం రేవంత్ రెడ్డి టోక్యోలో జరిగిన 'జపాన్ తెలుగు సమాఖ్య' కార్యక్రమంలో ప్రసంగించారు.జపాన్‌లో తెలంగాణ రైజింగ్ బృందం బిజీబిజీ.. రెండు ప్రముఖ సంస్థలతో కీలక ఒప్పందాలుతెలంగాణకు పెట్టుబడుల వరద పారించాలనే లక్ష్యంతో జపాన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అండ్ టీమ్ బిజీ బిజీగా పర్యటిస్తోంది. నాలుగు రోజులుగా జపాన్‌లోనే ఉంది తెలంగాణ రైజింగ్ బృందం. ఇంతకీ ఈ టీమ్ నాలుగో రోజు ఎక్కడెక్కడ పర్యటించింది. ఏమేం ఒప్పందాలు జరిగాయి? తెలుసుకుందాం. జపాన్‌లో పర్యటిస్తున్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం.. కితాక్యూషూ నగరాన్ని సందర్శించింది. నగర మేయర్ కజుహిసా టకేచీని తెలంగాణ బృందం కలిసింది. ఈ సందర్భంగా అక్కడి సాంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్యంతో ఉన్న నగరమే ఈ కితాక్యూషూ. అక్కడి గాలి, నీరు, నేల విషపూరితంగా ఉండేవి. కానీ ఇప్పుడు ఈ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది. ఆ నగరం అంతగా ఎలా అభివృద్ధి చెందింది. ఎలాంటి ప్రణాళికలు అమలుచేశారనే వివరాలను తెలంగాణ బృందం తెలుకుంది. మురసాకి రివర్ మ్యూజియంతోపాటు ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్‌నూ సందర్శించింది రేవంత్ టీమ్. తెలంగాణ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగేసింది. జపాన్‌లోని రెండు ప్రముఖ సంస్థలైన టెర్న్, రాజ్ గ్రూప్‌లతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాలతో హెల్త్ కేర్‌తోపాటు పలు రంగాల్లో జపాన్ సహకారం విస్తరించనుంది. ఈ ఒప్పందాలతో ఆరోగ్యరంగంలో 200, ఇంజినీరింగ్‌లో 100, టూరిజంలో 100, నిర్మాణరంగంలో

తరువాయి 2లో



## గిరిజనులను రెచ్చగొట్టవద్దు: మంత్రి సీతక్క

తరువాయి 2లో

**ఈ కబురు,** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ సభలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. 44 సంవత్సరాల క్రితం జరిగిన దురదృష్టకర సంఘటన అమరవీరుల గుండెల్లో చెరగని ముద్ర వేసింది. అటవీఅధికారులు సంయమనం పాటించాలంటూ.. గిరిజనులను రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని మంత్రి సీతక్క సూచించారు.

## 3038 ఉద్యోగాలు.. నోటిఫికేషన్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన



**ఈ కబురు, హైదరాబాద్:**

త్వరలోనే ఆర్టీసీ లో 3038 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తుండడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. 3038 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని త్వరలోనే నోటిఫికేషన్ వేసి సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుందని దీని ద్వారా ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని వెల్లడించారు. ఇప్పటివరకు ఆర్టీసీ లో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని వారు రూ.5500 కోట్లు ఆదా చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి కోసం కొత్త బస్సులు కొనుగోలు చేశామని ఇప్పుడు ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ సన్నద్ధం అయిందని

తరువాయి 2లో



## బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణకే ఎక్కువ నష్టం: కేటీఆర్

2లో

**ఈ కబురు, హైదరాబాద్:**

## జమ్మూ కశ్మీర్‌లో వర్ష బీభత్సం.. ముగ్గురు మృతి



2లో

## యెమెన్‌పై విరుచుకుపడ్డ అమెరికా యుద్ధవిమానాలు.. 50 లక్ష్యాలపై దాడు



**ఈ కబురు,**

**యెమెన్ నగరాలపై మరోసారి అమెరికా యుద్ధ విమానాలు గర్జించాయి. ఈ సారి దాదాపు 50 లక్ష్యాలపై బాంబుల వర్షం కురిపించాయి.**

అమెరికా యుద్ధ విమానాలు యెమెన్ రాజధాని సనా సహా పలు నగరాలపై బాంబుల వర్షం కురిపించాయి.దాదాపు 50 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు అల్‌అరేబియా పత్రిక పేర్కొంది. సనా, హోదైద, అమ్రాన్ నగరాలపై బాంబులు జార విడిచినట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి ఈ దాడులు చోటు చేసుకున్నాయి. తాజా దాడుల్లో హోదైదలోని పోర్టు, విమానాశ్రయం కూడా ధ్వంసమైనట్లు హూతీలు చెబుతున్నారు. ముగ్గురు వ్యక్తులు చనిపోయినట్లు కూడా పేర్కొన్నారు. తమ దాడులు ఏమాత్రం ఆగవని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. కొన్ని రోజుల క్రితమే అమెరికా ఎర్ర సముద్రంలో నౌకాశ్రయంపై చేసిన దాడుల్లో 70 మంది చనిపోయారు. దాదాపు 171 మంది గాయపడ్డారు. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో ఇదే అత్యంత తీవ్రమైంది. ఈ దాడిపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ స్పందించారు. ఈ చర్యలు తీవ్ర ఆందోళనకరమన్నారు. హూతీ రెబల్స్ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించడంతో ఈ దాడులు జరుగుతున్నాయి.

## ఒకే గుడి, ఒకే బావి.. మోహన్ భగవత్ పిలుపు



3లో

## పేరుకే 'కాల్పుల విరమణ'.. దాడులు ఆగడం లేదు: జెలెన్‌స్కీ

3లో



## కార్పొరేట్‌గవర్నెన్స్‌కు హైదరాబాద్ చాప్టర్ కీలకం కానుంది: కిషన్ రెడ్డి



3లో

## 'అమెరికాలో రాజులు లేరు'.. ట్రంప్‌నకు వ్యతిరేకంగా మరోసారి నిరసన




## చిట్ట చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు : డిప్యూటీ సీఎం



3లో

## చెలరేగిన రోహిత్, సూర్య... చెన్నైపై ముంబై విజయం



6లో

## 3038 ఉద్యోగాలు.. నోటిఫికేషన్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన



మొత్తం 3038 ఉద్యోగాల్లో...డ్రైవర్ 2000 ,శ్రామిక్ 743,డిప్యూటీ సూపరిండెంట్ (ట్రాఫిక్) 84,,డిప్యూటీ సూపరిండెంట్ (మెకానికల్) 114, డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ 25,,అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ 18,అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) 23,సెక్షన్ ఆఫీసర్ ( సివిల్) 11,అకౌంట్ ఆఫీసర్స్ 6M,,మెడికల్ ఆఫీసర్స్ జనరల్ 7,,మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ 7,పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనుంది. ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వంలో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తూ దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఇప్పుడు మరోసారి భారీస్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లు క్యాలండర్ ప్రకారం విడుదల చేయనుందని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని బాగా ప్రిపేర్ కావాలని సూచించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ జరుగుతుండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

## గిరిజనులను రెచ్చగొట్టవద్దు: మంత్రి సీతక్క



ఏప్రిల్ 20వ తేదీ రాగానే చాలామంది ఈ సంఘటన గుర్తొచ్చి భయం తో వణికిపోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఆదిలాబాద్ లో స్మృతివనం ఏర్పాటు చేస్తానన్న హామీని నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వం అమర వీరులందనికి గుర్తించలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అందరిని గుర్తించేందుక ఐటీడీఏ అధికారులతో కమిటి వేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. అమర వీరుల కుటుంబాలకు ఐసీడీఎస్.. పంచాయితీ రాజ్ శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చి అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఐటిడిఎలు.. పోడు భూముల చట్టం.. పీసా.. ఉపాధి హామీ చట్టం అమరవీరుల త్యాగాల వల్లనే వచ్చాయన్నారు..

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తామన్న సీతక్క.. ఏజన్సీ ఏరియాల్లో గిరిజనులకు ఉద్యోగాలిచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తామని... ఇప్పపువ్వు లడ్డూలతో విద్యార్థులకు ఎనిమియా దూరం అవుతుందన్నారు. సర్వే జరగని భూములకు సర్వే చేసి.. పట్టాలిస్తామన్నారు.

## జమ్మూ కశ్మీర్‌లో వర్ష బీభత్సం..ముగ్గురు మృతి



**జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షా లు, బలమైన ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి.**

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న కుండపోత వానల కారణంగా భారీగా కొండచరియలు విరిగిపడుతున్నాయి. రాంబన్ జిల్లాలో దాదాపు 40 ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వరదలో చిక్కుకొని ముగ్గురు మరణించగా.. సుమారు 100మందిని సహాయక బృందాలు రక్షించినట్లు అధికారులు పేర్కొన్నారు. చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు. కొండ చరియలు విరిగి పడడంతో ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. శిథిలాల కింద వాహనాలు చిక్కుకుపోయినట్లు చెబుతున్నారు. పశ్చిమాసియాలోని ప్రత్యేకమైన వాతవరణ పరిస్థితుల వల్లే జమ్మూలో భారీ వర్షాలు, తుఫాను సంభవించిందని వాతావరణ శాఖ తెలిపింది. ఐదేళ్లలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు, బలమై గాలులు వీయడం ఇదే మొదటిసారని పేర్కొంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా వరదలు చీనాబ్ వంతెన సమీపంలోని ధరంకుండ్ గ్రామాన్ని ముంచెత్తాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇళ్లు వాహనాలు కొట్టుకుపోయాయని.. ఇళ్లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సహాయ బృందాలు శ్రమిస్తున్నాయని తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ.. డిప్యూటీ కమిషనర్ బషీర్‌ఉల్‌హక్ చౌదరితో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని చెప్పారు. ఆర్థిక, ఇతర సహాయాన్ని అందిస్తున్నామని అన్నారు.ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. రాంబన్‌లో కొండ చరియలు విరిగిపడడం వల్ల తీవ్ర ఆస్తి నష్టం సంభవించిందన్నారు. విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

## బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణకే ఎక్కువ నష్టం: కేటీఆర్



కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్ని కథలు చెప్పినా ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రజలు వారి మాటలను నమ్మలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓఆర్ఆర్ లో కాంగ్రెస్ కు ఒక్క సీటు రాలేదని గోషామహల్ లో మన అభ్యర్థి ఆగమాగం చేయడంతోనే అక్కడ బీజేపీ గెలిచిందన్నారు. ఇవాళ తెలంగాణ భవన్ లో అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను కొంత మంది టెంప్ట్ అయి కాంగ్రెస్ కు అవకాశం ఇస్తే మన తినే గిన్నెలో మట్టిపోసుకున్నట్లు అయిందన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని మంచి చేస్తే ఎవరైనా అభినందిస్తారు. గతంలో వైఎస్సార్, చంద్రబాబు నాయుడు మంచి పనులు చేశారు. వారిని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో వారు చేసిన మంచిపనులుంటే కేసీఆర్ కొనసాగించారని కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటున్నారని మండిపడ్డారు. కానీ ఆనావాళ్లు తొలగిస్తామని అనడం అనాగరిక చర్య అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 500 రోజులు అయినా ఒక్క పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. ఎన్నికల్లో జరిగిన నష్టం బీఆర్ఎస్ పార్టీ కంటే తెలంగాణ సమాజానికే ఎక్కువ జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలవడం తిరిగి కేసీఆర్ ను ముఖ్యమంత్రి చేసుకోవడం మన పార్టీ అవసరం కాదని ఇది తెలంగాణ సమాజం కోసం చారిత్రక అవసరం అన్నారు.

కేసీఆర్ హయాంలో పదేళ్లలో ఒక్క ప్లాట్, వెంచర్, బిల్డింగ్ వద్దకు వెళ్లి దాదాగిరీ చేసే దమ్మున్నోడు లేదు. కానీ ఇవాళ కాంగ్రెస్ హాయంలో ఎవరికి దోచుకున్నంత దోచుకుంటున్నారని ఆరోపించారు. పేదలను కొడుతున్న హైడ్రా మంత్రులు, కాంగ్రెస్ నేతల వద్దకు ఎందుకు పోవడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి అన్ని నెగిటివ్ పనులే తప్ప పాజిటివ్ పనులు లేవన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసేందుకు డబ్బులు లేవని చెబుతున్న ప్రభుత్వం మూసీకి మాత్రం లక్షన్నర కోట్లా అని ప్రశ్నిచారు. మూసీతో మురిసే రైతులు ఎంతమంది? దాంతో వచ్చే ఆయకట్టు ఎంతా అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన వద్దనడం లేదు. కానీ మింగ మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె అన్న చందంగా సంక్షేమ పథకాలు నిధులు లేకుండా మూసీ సోకులు ఎందుకు అని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లకు రెండు బడ్జెట్ లలో నిధులు ఇచ్చారు కానీ ఇప్పటి వరకు ఒక్క ఇటుక పెట్టలేదన్నారు. దేశజనాభాలో 3 శాతం కంటే తక్కువ ఉన్న తెలంగాణ రాష్ట్రం కేంద్రం ఇచ్చే 30 ఉత్తమ పంచాయతీ అవార్డులు గెలుచుకుందన్నారు. కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండింటిని సమానంగా తీసుకువెళ్లారన్నారు.

పదకొండేళ్లుగా హిందూ, ముస్లిలను మతం పేరుతో విభజించడం తప్ప నరేంద్ర మోడీ చేసిందేమి లేదన్నారు. మోడీ వచ్చాక తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదన్నారు. ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. మోడీ, రేవంత్ రెడ్డి నెగిటివ్ పాలిటిక్స్ తప్ప చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీపై నేషనల్ హెరాల్డ్ కేసులు పెడితే ఇప్పటి వరుక రేవంత్ రెడ్డి మాట్లాడలేదని ఇది రాబోయే రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్ ఒకరినొకరు కాపాడుకునేందుకు సంకేతమా అని ప్రశ్నించారు. తెలంగాణకు బీజేపీ, కాంగ్రెస్ రెండూ శత్రువులేనన్నారు. గులాబీ జెండానే తెలంగాణకు గుండె ధైర్యం అన్నారు. చేవెళ్ల, రాజేంద్రనగర్ లో తప్పకుండా ఉప ఎన్నికలు వస్తాయని అక్కడ కాంగ్రెస్ కు దిమ్మతిరేగేలా పార్టీ గెలవాలన్నారు.

# జపాన్లోని కితాక్యూషు నగరాన్ని సందర్శించిన సీఎం



**100 ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.**

టోక్యో చేరిన తొలి రోజే జపాన్ పారిశ్రామిక దిగ్గజం మారుబెనీ కార్పొరేషన్‌తో భారీ ఒప్పందం కుదిరింది. ఫ్యూచర్ సిటీలోని 600 ఎకరాల్లో నెక్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఈ సంస్థ అభివృద్ధి చేయనుంది. ప్రారంభ దశలోనే వెయ్యి కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ పార్క్ ద్వారా మరిన్ని జపాన్, మల్టీనేషనల్ కంపెనీలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మొత్తంగా ఈ ప్రాజెక్ట్ ద్వారా 5 వేల కోట్లకుపైగా పెట్టుబడులు.. 30 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించబడే అవకాశం ఉందని ప్రభుత్వం చెప్తోంది. టోక్యోలోని సోనీ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. అనుబంధ సంస్థ అయిన క్రంచిరోల్ టాప్ ఎగ్జిక్యూటివ్‌లతో రేవంత్ భేటీ అయ్యారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాల్లో హైదరాబాద్‌ను హబ్‌గా అభివృద్ధి చేయాలని సీఎం ప్రతిపాదించారు. అలాగే, టోక్యోలోని జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మెట్రో ఫేజ్ 2, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, రీజనల్ రింగ్ రోడ్డు లాంటి మెగా ప్రాజెక్టులకు రూ.11వేల 693 కోట్ల విదేశీ రుణం ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ నగరాన్ని టోక్యో తరహాలో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టులు మైలురాయిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మరో రెండు రోజులు జపాన్‌లో పర్యటించనుంది తెలంగాణ బృందం. రూ. 50వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా జపాన్‌లో పర్యటిస్తున్న రేవంత్ టీమ్.. లక్ష్యాన్ని సాధిస్తుందా.. లేదా.. చూడాలి మరి..!

**త్వరలో హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటు, జపాన్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం**

జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పర్యావరణహిత కిటాక్యూష నగరాన్ని ఆదివారం సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకుంటుంది. కిటాక్యూష సిటీ మేయర్ కజుహిసా టేకుచితో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు అధికారులు భేటీ అయ్యారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర మోడల్స్, నదుల పునరుజ్జీవన విధానాలపై చర్చలు జరిపారు.

### క్లీన్ హైదరాబాద్ కోసం ఒప్పందాలు

ఈ సందర్భంగా ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నిప్పాన్ స్టీల్ ఇంజినీరింగ్, పీ9 ఎల్ఎల్పీ , న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ పై తెలంగాణ ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యూష మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ ఒప్పందాలు జరిగాయి. త్వరలో హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటు, జపాన్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందంఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు పడ్డ జపాన్ నగరం కిటాక్యూష ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ టేకుచి రాష్ట్ర ప్రతినిధులకు వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంతో పంచుకునేందుకు కోరగా వారు అంగీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సుస్థిరత ఇకపై ఐచ్చికం కాదు అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితో పాటు పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఎకో టౌన్ డెవలప్ చేయటం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమై వాతావరణాన్ని అందించగలమని ధీమా వ్యక్తం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రం అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలనతో జపాన్ కంపెనీల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్వెస్టర్లు, సంస్థలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు.

### జపనీస్ భాషా పాఠశాల కోసం చర్చలు

హైదరాబాద్ - కిటాక్యూష రెండు నగరాల మధ్య విమాన ప్రయాణ ఏర్పాటు చేయాలనే ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో జపనీస్ భాషా పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. జపాన్‌లో యువ శక్తి అవసరం ఎక్కువగా ఉంది. మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కలిగిస్తే, అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధుల బృందం మురాసాకి పునరుజ్జీవన ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కేంద్రంగా ఉన్న ఈ నది, పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును తెలంగాణ నేతలు, అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు.

# ‘అమెరికాలో రాజులు లేరు’.. ట్రంప్‌నకు వ్యతిరేకంగా మరోసారి నిరసన




## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు మరోసారి నిరసనలు చేపట్టారు.

తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై అమెరికా ప్రజలు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఆయన పాలనపై మండిపడ్డారు. దేశవ్యాప్తంగా నగర వీధుల్లోకి వచ్చి ప్లకార్డులతో ట్రంప్‌నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### వలసదారులకు స్వాగతం..

న్యూయార్క్‌లోని ప్రధాన గ్రంథాలయం వెలుపల జనం గుమిగూడి.. ‘అమెరికాలో రాజులు ఎవరూ లేరు’, ‘ఈ దౌర్జన్యాన్ని ఎదిరించండి’ అంటూ నినాదాలు చేశారు. తాత్కాలిక వలసదారులకున్న చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయడం, వారిని బహిష్కరించడంపై ఆందోళనకారులు మండిపడ్డారు. “ఎలాంటి భయం లేదు.. వలసదారులకు స్వాగతం” అంటూ నినాదాలు చేశారు. రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ట్రంప్ పాలన సాగుతోందన్నారు. ఆయన తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

### యెమెన్‌పై విరుచుకుపడ్డ అమెరికా యుద్ధవిమానాలు.. 50 లక్ష్యాలపై దాడులు

ఎఫ్1 విద్యార్థి వీసా ముగిసినా అమెరికాలోనే ఉంటున్న పాలస్తీనాకు చెందిన విద్యార్థిని లెకా కోర్డియాను అక్కడి అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అదే విధంగా మరో పాలస్తీనా విద్యార్థిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే.. ట్రంప్ పని తీరును నిరసిస్తూ ఇటీవల అమెరికా ప్రజలు దేశమంతటా ర్యాలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. న్యూయార్క్ నుంచి అలస్కా దాకా వీధుల్లో జనం పోటెత్తి ‘హ్యాండ్సాఫ్’ అంటూ నినదించారు. రిపబ్లికన్ల పాలన ప్రారంభమయ్యాక జరిగిన అతి పెద్ద నిరసనగా ఇది నిలిచింది.

పౌర హక్కుల, కార్మిక సంఘాలు, ఎల్‌జీబీటీక్యూ సంస్థలు, న్యాయవాద సంఘాలు, సీనియర్ సిటిజెన్, ఎన్నికల సంస్కరణల సంఘాల ఆధ్వర్యంలో 50 రాష్ట్రాల్లోని 1,200 ప్రాంతాల్లో చేపట్టిన ఈ ‘హ్యాండ్సాఫ్’ ఆందోళనలకు ప్రజల నుంచి భారీగా స్పందన వచ్చింది. అయితే.. శాంతియుతంగానే నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తాజాగా మరోసారి ట్రంప్‌నకు వ్యతిరేకంగా నిరసనలు చేశారు.

# పేరుకే 'కాల్పుల విరమణ'.. దాడులు ఆగడం లేదు: జెలెన్‌స్కీ



**తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా.. ఆ మాటకు కట్టుబడి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు.**

ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా ఆ మాటకు కట్టుబడి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈస్టర్ కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు తప్పుడు వైఖరిని ఆ దేశం ప్రదర్శిస్తోందన్నారు. ఎప్పటిలాగే తమపై దాడులు కొనసాగించిందని.. పదుల కొద్దీ డ్రోన్, బాంబు దాడుల ఘటనలు నమోదయ్యాయని తెలిపారు. మరోవైపు.. కీవ్ బలగాలూ దాడులు కొనసాగించాయని రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లోని అధికారులు ఆరోపించారు.

"తాత్కాలిక కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు రష్యా సైన్యం చెబుతోంది. కానీ, యుద్ధక్షేత్రంలో పైచేయి సాధించే, మా దేశానికి నష్టం కలిగించే ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. 50కిపైగా బాంబు దాడులు, పదుల కొద్ది డ్రోన్ దాడులకు పాల్పడింది. ఉదయం 10 గంటల నుంచి తీవ్రత మరింత పెరిగింది. అయితే, వైమానిక దాడులకు సంబంధించి సైరన్‌లు మోగకపోవడం కాస్త ఉపశమనం కలిగించే అంశం. క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలిస్తుంటే.. పుతిన్‌కు తన సైన్యంపై పూర్తి నియంత్రణ లేదని.. లేదా, యుద్ధాన్ని ముగించే ఉద్దేశం ఆ దేశానికి లేదనేది స్పష్టమవుతోంది" అని జెలెన్‌స్కీ ట్వీట్లు చేశారు. కాల్పుల విరమణ షరతులకు పూర్తిగా కట్టుబడి ఉండాలని మాస్కోను డిమాండ్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి 30 రోజుల పాటు కాల్పుల విరమణను పొడిగించాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు.

### 'అమెరికాలో రాజులు లేరు'.. ట్రంప్‌నకు వ్యతిరేకంగా మరోసారి నిరసన

ఇదిలా ఉండగా.. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాపై మాస్కో నియంత్రణను గుర్తించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ శాంతి ప్రతిపాదన వల్ల రెండు దేశాల మధ్య తక్షణ కాల్పుల విరమణ అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఉక్రెయిన్, ఐరోపా యంత్రాంగాలు పారిస్‌లో పరిశీలించాయి. క్రిమియాపై రష్యా నియంత్రణ కొనసాగడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుకూలంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు.. కష్టమైనా చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించింది.

# చిట్ట చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు : డిప్యూటీ సీఎం




ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రజాపాలన కొనసాగిస్తుందని ఉప ముఖ్యమంత్రి ఆర్థిక ప్రణాళిక విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గం, మధిర మండలంలోని పలు గ్రామాల్లో రూ.72.33 కోట్ల అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు అభివృద్ధితోనే మెరుగుపడతాయని భావిస్తున్న ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, విద్య, వైద్యానికి పెద్దపీట వేయడం తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నదని వివరించారు. రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా మధిరను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ ప్రజా భవన్ నుంచి రోడ్డు మార్గం ద్వారా మధిర మండలం సిరిపురం గ్రామానికి చేరుకున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు గ్రామ శివారులో మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు.

జూనియర్ కళాశాల ప్రాంగణం వరకు దారి వెంట బంతిపూల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. గ్రామస్తులను కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి యోగక్షేమాలు అడుగుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముందుకు సాగారు. వైరా నదిపై 6 కోట్ల 85 లక్షల రూపాయలతో నిర్మాణం చేయనున్న చెక్ డ్యాం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ చెక్ డ్యాం నిర్మాణం చేపట్టడం వల్ల భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడతాయని, నది పొడవునా 1.5 కిలోమీటర్లు పొడవునా నీరు నిలిచి ఉండడంతో వేసవి చలికాలంలో భూగర్భ జలాల కొరత తగ్గిపోతుందని, 1240 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అదే విధంగా గ్రామంలో 5 కోట్ల రూపాయలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన సముదాయానికి, 1137.21 కోట్ల రూపాయలతో ఐటిఐ కళాశాల భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు.

ఆ తర్వాత సిరిపురం గ్రామం నుంచి మహాదేవపురం గ్రామానికి చేరుకుని వైరా రివర్ పై మహాదేవపురం వద్ద 1213.95 కోట్ల రూపాయలతో నిర్మాణం చేసిన మహాదేవపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. ఈ పథకం ద్వారా 16.40 క్యూసెక్కుల నీటిని వైరా నది నుంచి ఎత్తిపోయడం వల్ల 952 ఎకరాల వ్యవసాయ భూములు సస్యశ్యామలం కానున్నాయి.ఇది కేవలం నీటి సరఫరా మాత్రమే కాకుండా, రైతు జీవితాల్లో ఒక దీర్ఘకాలిక మార్పుని తీసుకురానుంది. అదే విధంగా ఈ ప్రాజెక్టు వలన రైతు కష్టానికి ఫలితంగా పండిన పంటలు, వృద్ధి చెందిన ఆదాయం, మెరుగైన జీవన ప్రమాణాలను అభివృద్ధి చెందనున్నాయి. రాయపట్నం గ్రామానికి చేరుకొని వైరా రివర్ కుడి కాలువపై రాయపట్నం గ్రామం వద్ద 1906 కోట్ల రూపాయలతో 1079 ఎకరాలకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. చిట్ట చివరి ఆయకట్టు భూముల వరకు సాగర్ జలాలు వచ్చే విధంగా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టి మధిర నియోజకవర్గానికి సాగర్ జలాలతో తడుపుతామన్నారు.

మధిర క్యాంపు కార్యాలయానికి చేరుకుని క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. శంకుస్థాపన చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి కావడానికి క్యాలెండర్ ఫిక్స్ చేసుకొని వారం, 15 రోజులు, నెల రోజులు పనుల పురోగతి లక్ష్యం నిర్దేశించుకుని దానిని చేరుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని అంబారుపేట గ్రామంలో మధిర నుంచి మొలుగుమాడు వయా నిదానపురం గ్రామం వరకు 25 కోట్ల రూపాయలతో విస్తరిస్తున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ పి శ్రీజ, ఖమ్మం ఆర్డీవో జీ నరసింహారావు, ఖమ్మం సీఈవో బి రమేష్‌బాబు, విద్యుత్ శాఖ ఎస్ ఇ శ్రీనివాసాచారి, ఆర్ అండ్ బి ఎస్ ఇ యుగంధర్, ఇరిగేషన్ కల్లూరి సర్కిల్ ఎస్సీ జీ వాసంతి, పి ఆర్ ఏ ఈ ఈ వెంకటరెడ్డి, ఇరిగేషన్ మధిర డివిజన్ సిహెచ్ రామకృష్ణ, మధిర డిఈఈ నాగ బ్రహ్మయ్య, సిరిపురం ఏఇఇ శివసాగర్, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, పట్టణ మండల అధ్యక్షులు మిర్యాల వెంకటరమణ గుప్తా, సూరంశెట్టి కిషోర్, నాయకులు శీలం వెంకటరెడ్డి, కర్నాటి రామారావు, కరివేద రామారావు, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, దుంప వెంకటేశ్వర్ రెడ్డి , యన్నం కోటేశ్వరరావు, పాటిబండ్ల సత్యంబాబు, తుమాటి నవీన్ రెడ్డి, అద్దంకి రవికుమార్, పులిబండ్ల చిట్టిబాబు, బాధాకృష్ణారెడ్డి, అమరవాది సత్యనారాయణ రెడ్డి, నాగబోయిన రామారావు, నిడమానూరు వంశీకృష్ణ, బొగ్గుల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మధిర నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా 80 కంపెనీలతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారధ్యంలో రెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ వేదికగా సోమవారం జరగనున్న మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభిస్తారు. నియోజకవర్గంలోని 5వేల మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు ఇప్పించడానికి నిర్వహించే ఈ జాబ్ మేళాకు రాష్ట్ర రాజధాని హైదరాబాదు నుంచి 80 ప్రైవేటు కంపెనీలు రానున్నాయి. జాబ్ మేళా కు హాజరయ్యే అభ్యర్థులను వారి విద్యా అర్హతను బట్టి ఆ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు.

ఉద్యోగాల కోసం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో జరిగే ఈ మెగా జాబ్ మేళాకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గత వారం రోజుల నుంచి మెగా జాబ్ మేళాకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయా గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు వాల్ పోస్టర్లు అంటించి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేశారు. అభ్యర్థుల పేరు నమోదు కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ను కూడా ఏర్పాటు చేశారు. మధిరలో నేడు జరిగే జాబ్ మేళాకు నియోజకవర్గంలో నుంచి వేల సంఖ్యలో పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ యువకులు రానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఒకే గుడి, ఒకే బావి.. మోహన్ భగవత్ పిలుపు



**కుల భేదాలకు స్వస్తి పలకాలని హిందూ సమాజానికి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.**

దిల్లీ: కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ హిందూ కమ్యూనిటీ ప్రజలకు పిలుపునిచ్చారు. "ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక" అనే సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలని సూచించారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని కోరారు.

అలీగఢ్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్న మోహన్ భగవత్ అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందూ విలువల ప్రాముఖ్యతను చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా శాంతి సాధించడానికి ముందుగా.. భారత్ సామాజిక ఐక్యత సాధించడం కీలకం. హిందూ సమాజానికి పునాదిగా భావించే సంస్కారం (విలువలు), సంప్రదాయం, సాంస్కృతిక విలువలు, నైతిక సూత్రాల పేరుతో ఆ చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలి. కుల భేదాలకు స్వస్తి పలకాలి" అని పిలుపునిచ్చారు.

**మర్యాదగా మాట్లాడే పరిస్థితుల్లో లేను: దిల్లీ ఎయిర్‌పోర్ట్‌పై ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం**

"నైతిక విలువలను పాటిస్తూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోవాలి. ఎలాంటి భేదాలు చూపకుండా అన్ని వర్గాల వారిని ఇళ్లలోకి ఆహ్వానించాలి. అట్టడుగు స్థాయిలో సామరస్యం, ఐక్యతను వ్యాప్తి చేయాలి. సంస్కారం అనే పునాదిపై నుంచి కుటుంబం, దాని విలువలు రూపుదిద్దుకున్నాయి. ఇది సమాజంలో ప్రాథమిక యూనిట్‌గా ఉంటోంది. జాతీయవాదం, సామాజిక ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగలను సామూహికంగా నిర్వహించడం ఎంతో ముఖ్యం" అని పేర్కొన్నారు.

# కార్పొరేట్‌గవర్నన్స్‌కు హైదరాబాద్ చాప్టర్ కీలకం కానుంది: కిషన్ రెడ్డి



నగరంలోని ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ నూతన భవనానికి శంకుస్థాపనకు హాజరు కావడం చాలా సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇది హైదరాబాద్ చాప్టర్‌కి మాత్రమే కాకుండా దేశంలోని కార్పొరేట్ గవర్నెన్స్‌కు కీలక ఘట్టమని చెప్పొచ్చని ఆయన తెలిపారు. ఆదివారం చాప్టర్‌నూతన భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కంపెనీ సెక్రటరీలు దేశ కార్పొరేట్ రంగానికి రూపురేఖలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. కార్పొరేట్ కంపెనీలు విలువలను పాటిస్తూ పారదర్శకంగా చట్టాలను అనుసరించేలా చేస్తూ దేశ కార్పొరేట్ గవర్నెన్స్ కు వెన్నెముకలా నిలిచారని ప్రశంసించారు. కంపెనీల సమగ్రత కాపాడడంతోపాటు కార్పొరేట్ వ్యవహారాల నిర్వహణ సరిగా ఉండేలా చూస్తూ దేశ ఆర్థిక వృద్ధి లో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. 2017లో జరిగిన ఐసీఎస్ఐ జూబ్లీ వేడుకల్లో ప్రధాని మోడీ కూడా ఇదే విషయాన్ని గుర్తు చేశారన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్కృతిని పెంపొందించడంతోపాటు దేశీయ వ్యాపారంపై నమ్మకం కలిగేలా చేశారని కొనియాడారు.ఈ నమ్మకంతోనే దేశ విదేశీ పెట్టుబడిదారులు మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. మన దేశం గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్‌గా వడివడిగా ముందుకు సాగుతోందన్నారు. సత్యం వధ ధర్మం చర అనే సూత్రం ఆధారంగా పని చేస్తోందన్నారు. ప్రతి కంపెనీ సెక్రటరీ ప్రతి నిత్యం ఈ సూత్రాన్ని ఆధారంగా పని చేస్తే దేశ వ్యాపార రంగం నిజాయితీ పారదర్శకతతో ముందుకు సాగుతుందన్నారు.

**వారిని కోర్టుకు లాగుతాను : మాజీ స్టార్ క్రికెటర్**

ఇప్పటికే భారతదేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.మరో రెండేళ్లలోనే 5 బిలియన్ మార్క్ దాటనుంది. ఈ విజయం సెక్రటరీల ప్రొఫెషనల్స్ హార్డ్ వర్క్, అంకితభావం, విలువలతో కూడిన వ్యాపారం వల్లే సాధ్యమైందన్నారు. ఇప్పటికే జర్మనీ, జపాన్ లాంటి దేశాలు మన టాలెంట్ ని గుర్తించి, కంపెనీ సెక్రటరీలు, లాయర్లు, అకౌంటెంట్లను వారి దేశాల్లో పనిచేసేందుకు నియమించుకుంటున్నాయి. మేధావుల కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తోంది. ఇంటలెక్చువల్, ప్రొఫెషనల్ స్కిల్స్ పెంచుకోవడం అంటే కేవలం వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాదు. సమాజంతోపాటు ప్రపంచ అభివృద్ధికి దోహదపడుతుందని విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. భారత్ ఆత్మ నిర్భరత సాధించే దిశగా కంపెనీ ఐసీఎస్ఐ లాంటి సంస్థలు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2047 నాటికి భారత్ వికసిత భారత్‌గా ఎదిగేందుకు భారత్‌తో పాటు ప్రపంచ దేశాల్లో వ్యాపారరంగం అభివృద్ధి చెందేందుకు మీలాంటి ప్రొఫెషనల్స్ నైపుణ్యం ఎంతో ఉపయోగపడుతుందని కిషన్ రెడ్డి తెలిపారు.

## రేపు17వ సివిల్ సర్వీసెస్ డే.. హాజరుకానున్న ప్రధాని మోడీ



17వ నేషనల్ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా సోమవారం సివిల్ సర్వెంట్లను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ప్రజా పాలనలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులను ప్రదానం చేయనున్నారు. అలాగే సమగ్ర అభివృద్ధి, గుర్తించిన ప్రాధాన్యతా కార్యక్రమాలు ఆవిష్కరణల అమలుపై విజయగాథలతో కూడిన ఈ పుస్తకాలను సైతం విడుదల చేయనున్నట్టు సిబ్బంది మంత్రిత్వ శాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అవార్డుల ప్రదానోత్సవానికి ముందు అవార్డు గెలుచుకోవడానికి గల కారణాలకు సంబంధించిన కార్యక్రమాలపై ఒక చిత్రం కూడా ప్రదర్శించనున్నారు. అనంతరం 'సివిల్ సర్వీసెస్ రీఫార్మ్స్, చాలెంజెస్ అండ్ అపార్చునిటీస్' అనే అంశంపై కేబినెట్ కార్యదర్శి డాక్టర్ టీవీ సోమనాథన్ అధ్యక్షతన ప్లీనరీ సెషన్ ఉంటుంది. న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. సివిల్ సర్వెంట్స్ డే వేడుకల్లో ప్రధాని మోడీ ప్రసంగించడం ఇది ఏడో సారి.

# అమెరికాపై మాకు 'నమ్మకం' లేదు!



**అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న టారిఫ్ విధానంతో పాటు, డాలర్‌కు వస్తున్న అధిక విక్రయాలూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే, డాలర్ విలువ జనవరి నుంచి 9% తగ్గింది. మూడేళ్లలోనే తక్కువ స్థాయికి డాలర్ చేరింది.**

## డాలరు బలహీనతలపై పెట్టుబడిదార్ల మాట

అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న టారిఫ్ విధానంతో పాటు, డాలర్‌కు వస్తున్న అధిక విక్రయాలూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే, డాలర్ విలువ జనవరి నుంచి 9% తగ్గింది. మూడేళ్లలోనే తక్కువ స్థాయికి డాలర్ చేరింది. ప్రపంచ వాణిజ్య రూపురేఖల్ని మార్చాలని ట్రంప్ ప్రయత్నిస్తుండడంతో, అమెరికాపై విశ్వాసాన్ని ప్రపంచ దేశాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆర్థిక వేత్తలు అంటున్నారు.

## డాలరుపై నమ్మకం పోతే ఏం జరుగుతుంది?

అంతర్జాతీయ వాణిజ్యంలో ఇప్పటిదాకా డాలరుదే ఆధిపత్యం. 5 దశాబ్దాలుగా అది భద్రమైన కరెన్సీగా నిలిచింది. అమెరికాలో రుణాలు తక్కువకే లభించడంతో ఆ దేశాన్ని ఒక శక్తిగా మార్చాయి. ప్రభుత్వానికి, వినియోగదార్లకు, వ్యాపారులకు తక్కువ రేట్లకే రుణాలు లభించడంతో ఆర్థిక వృద్ధి వేగంగా పరుగులు తీసింది. అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. అమెరికాపై మదుపర్లు విశ్వాసాన్ని కోల్పోతే ఆ దేశం భారీ స్థాయిలో ఆయా ప్రయోజనాలను కోల్పోతుంది. డాలరుకు ఉన్న ఆధిపత్యం తొలగిపోతుందని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఆర్థికవేత్త బారీ ఐషన్‌గ్రీన్ అంటున్నారు. డాలర్ విలువ మరింత బలహీనపడొచ్చన్న అంచనాలూ ఉన్నాయి.

## 'విశ్వాస' సంక్షోభమే!

డాలరు తనకున్న బలమైన, భద్రమైన లక్షణాలను కోల్పోతూ ఉండడంతో 'విశ్వాస సంక్షోభం' ఏర్పడొచ్చని డాయిష్ బ్యాంక్ అంటోంది. డాలరు హోదా/ఆధిపత్యంకొంత మేర ప్రశ్నార్థకంలో ఇప్పటికే పడిందని అంటోంది. సాధారణంగా టారిఫ్‌ల వల్ల విదేశీ ఉత్పత్తులకు గిరాకీ తగ్గుతుంది కాబట్టి డాలరు బలోపేతం కావాలి. కానీ ప్రస్తుత పరిణామాల్లో బలోపేతం కావడం అటుంచి, విలువ క్షీణిస్తుండటం ఆర్థికవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. వినియోగదార్లను ఇబ్బంది పెడుతోంది. ఏప్రిల్‌లో యూరో, పౌండ్‌తో పోలిస్తే 5% మేర, జపాన్ యెన్‌తో పోలిస్తే 6% మేర డాలర్ విలువ తగ్గింది. 'ఫ్రెంచి వైన్, దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్.. కేవలం టారిఫ్‌ల వల్ల అమెరికాలో ప్రియం కాలేదు. డాలర్ బలహీనతా కారణమైంద'ని చెబుతున్నారు.

## ఏం జరుగుతుంది?

డాలరు తన భద్రమైన హోదా కోల్పోతే, అమెరికా వినియోగదార్లకూ నష్టమే. రుణ రేట్లు పెరుగుతాయి. ఇప్పటికే వార్షిక ఆర్థిక ఉత్పత్తిలో 120% మేర ఉన్న అమెరికా ప్రభుత్వ రుణాలు, అధిక రుణ రేట్ల వల్ల మరింత పెరుగుతాయి. ఇది జరిగితే ప్రజలు డాలరుకు ప్రత్యామ్నాయాన్ని వెతుక్కునే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికే ఆ దిశగా ప్రయత్నాలూ జరుగుతున్నాయి.

## బిట్‌కాయిన్‌కు ప్రాధాన్యమా!

బిట్‌కాయిన్ వంటి డిజిటల్ ఆస్తులకు తన స్థానాన్ని డాలరు కోల్పోయే ప్రమాదమూ ఉందని బ్లాక్‌రాక్ ఛైర్మన్ లారీ ఫింక్ అంచనా వేస్తున్నారు.

వివిధ దేశాలపై టారిఫ్‌ను తీసుకొచ్చిన విధానం వల్ల.. తమ పెట్టుబడులకు తక్కువ స్థిరమైన, తక్కువ విశ్వాసం గల, తక్కువ భద్రమైన దేశంగా అమెరికాను పెట్టుబడిదార్లు భావించే ప్రమాదం లేకపోలేదు.

## సూయిజ్ సంక్షోభాన్ని గుర్తుకు తెస్తూ

ప్రపంచ దేశాల ఉత్పత్తులపై సుంకాలు విధిస్తూ ఏప్రిల్ 2న ట్రంప్ చేసిన ప్రకటన, 1956లో సూయిజ్ సంక్షోభ సమయాన్ని గుర్తు చేస్తోందని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. అప్పట్లో ఈజిప్టుపై మిలటరీ దాడుల ప్రణాళిక సరిగ్గా లేకపోవడం, దాడులు సరిగ్గా జరపకపోవడం, రాజకీయ అసమర్థత.. ఇవన్నీ కలిసి బ్రిటన్‌ను ముంచాయి. ఫలితంగా శతాబ్దాలుగా కాపాడుకున్న వాణిజ్య ఆధిపత్యాన్ని బ్రిటన్ కరెన్సీ అయిన పౌండ్ కోల్పోయింది. ట్రంప్ కూడా మేల్కొనకపోతే, 'లిబరేషన్ డే'గా కాస్తా ఇదే తరహాలో చరిత్రలో గుర్తిండిపోతుందని అంటున్నారు.

## చైనా యత్నాలివీ

బ్రెజిల్‌తో వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యానికి, తన కరెన్సీ అయిన యువాన్ ప్రకారమే చైనా ఒప్పందం కుదుర్చుకుంటోంది. రష్యా చమురు, దక్షిణ కొరియా నుంచి ఇతర వస్తువుల కొనుగోలుకూ యువాన్‌తోనే వాణిజ్యం చేస్తోంది. అర్జెంటీనా, పాకిస్థాన్ వంటి దేశాలకు యువాన్ రూపంలోనే రుణాలు ఇస్తూ డాలరుకు ప్రత్యామ్నాయంగా మారాలని చూస్తోంది.

# ట్రంప్ కొట్టిన దెబ్బ..
# ఊడుతున్న 800 ఉద్యోగాలు!

**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. అన్ని పరిశ్రమల్లోనూ అనిశ్చితి ఆవహించింది. ఈ క్రమంలో స్వీడన్‌కు చెందిన భారీ వాహన తయారీ సంస్థ వోల్వో గ్రూప్ కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్ అనిశ్చితి, ట్రక్కులకు డిమాండ్ తగ్గుముఖం పట్టడం వంటి కారణాలతో అమెరికాలోని మూడు కర్మాగారాలలో 550 నుంచి 800 మంది కార్మికులను తొలగించేందుకు సిద్ధమైందని రాయిటర్స్ కథనం పేర్కొంది.**



ఈ తొలగింపులు పెన్సిల్వేనియాలోని మకుంగీలో ఉన్న మాక్ ట్రక్స్ ప్లాంట్, వర్జీనియాలోని డబ్లిన్, మేరీల్యాండ్‌లోని హేగర్‌స్టౌన్‌లో ఉన్న రెండు వోల్వో సైట్‌లలోని ఉద్యోగులను ప్రభావితం చేస్తాయి. ట్రంప్ విధించిన సుంకాలు ప్రపంచ వాణిజ్యాన్ని, ముఖ్యంగా ఆటోమోటివ్, భారీ పరికరాల రంగాలను అస్తవ్యస్తం చేసి, తయారీ ఖర్చులను పెంచడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**సుంకాలే కారణం..**
ఉత్తర అమెరికాలో దాదాపు 20,000 మంది కార్మికులు ఉన్న వోల్వో సంస్థ భారీడ్యూటీ ట్రక్కులకు మార్కెట్ బలహీనంగా ఉన్నందున ఉత్పత్తిని సర్దుబాటు చేయడానికి ఈ ఉద్యోగ కోతలు అవసరమని కంపెనీ ప్రతినిధిని ఉటంకిస్తూ రాయిటర్స్ వివరించింది. సరుకు రవాణా రేట్లలో అస్థిరత, సంభావ్య నియంత్రణ మార్పులు, సుంకాల వల్ల కలిగే విస్తృత ఆర్థిక ప్రభావం వంటి అనేక కారణాలు ఈ తొలగింపులకు దోహదపడ్డాయని కంపెనీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. "ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేయడానికి, దీర్ఘకాలిక పోటీతత్వాన్ని నిర్ధారించడానికి మేము ఈ చర్యలు తీసుకుంటున్నాము" ఆ ప్రతినిధి తెలిపారు.



**ఇటీవలి నెలల్లో అమెరికా ట్రక్కింగ్ పరిశ్రమ గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంది. ఇప్పడీ సుంకాలు.. ముడి పదార్థాలు, విడి భాగాల ఖర్చులను మరింత పెంచాయి. ఫ్రైట్ డిమాండ్ తగ్గడం, ఆర్థిక అనిశ్చితి వంటివి వోల్వో వంటి స్థిరమైన వాణిజ్య పరిస్థితులపై ఆధారపడే సంస్థలను మరింత ఒత్తిడికి గురిచేశాయని పరిశ్రమ విశ్లేషకులు పేర్కొంటున్నారు. తొలగింపునకు సంభందించిన పూర్తి వివరాలు వెల్లడి కానప్పటికీ ప్రభావితమైన కార్మికులకు సెవరెన్స్ ప్యాకేజీలు, ఇతర సాయాన్ని కంపెనీ అందించనున్నట్లు తెలుస్తోంది.**

# అది గ్రేట్ మూవీ అంటున్న ఎలాన్ మస్క్..
# ఇంతకీ ఏ సినిమా అంటే?

**టామ్ క్రూజ్ నటించిన 'ఎడ్జ్ ఆఫ్ టుమారో' చిత్రాన్ని ప్రశంసిస్తూ.. ఎలాన్ మస్క్ ట్వీట్ చేశారు. సినిమా ట్వీట్స్ అనే ఎక్స్ యూజర్ చేసిన ట్వీట్‌పై టెస్లా సీఈఓ స్పందిస్తూ 'గ్రేట్ మూవీ' అని అన్నారు.**



''ఎడ్జ్ ఆఫ్ టుమారో అనేది మరోమారు చూడాల్సిన సినిమా అనేదానికి సరైన నిర్వచనం. ఈ మూవీ ఫిల్మోగ్రఫీలో ఏ స్థానంలో ఉందో నాకు తెలియదు. కానీ క్రూజ్ ఇప్పటివరకు తీసిన ఒరిజినల్ చిత్రాలలో ఇది ఖచ్చితంగా ఒకటి. ఎమిలీ బ్లంట్‌తో క్రూజ్ కెమిస్ట్రీ కూడా చాలా ప్రత్యేకమైనది. నాకు ఈ సినిమా చాలా ఇష్టం'' అని సినిమా ట్వీట్స్ యూజర్ అన్నారు. దీనిపై మస్క్ స్పందిస్తూ.. గ్రేట్ మూవీ అని అన్నారు.

డగ్ లిమాన్ దర్శకత్వం వహించిన ఎడ్జ్ ఆఫ్ టుమారో అనేది 2014లో విడుదలైన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ చిత్రం. భవిష్యత్తులో భూమిని మిమిక్స్ అనే గ్రహాంతర జాతి దాడి చేస్తుంది. టామ్ క్రూజ్ మేజర్ విలియం కేజ్ పాత్రను పోషిస్తాడు. దీనిని హిరోషి సకురాజాకా రాసిన జపనీస్ నవల "ఆల్ యు నీడ్ ఈజ్ కిల్" ఆధారంగా తెరకెక్కించారు.

**ఇండియాకు ఎలాన్ మస్క్**
ప్రపంచకుబేరుడు 'ఎలాన్ మస్క్' ఈ ఏడాది చివర్లో భారతదేశాన్ని సందర్శిస్తానని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడటం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. శుక్రవారం మోదీతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన తర్వాత మస్క్ ఈ ప్రకటన చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల్లో అమెరికాతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు భారత్ కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌తో ఈ ఏడాది ప్రారంభంలో



# ఫుడ్ ఆర్డర్‌తో పాటు ఓ స్లిప్ పంచుతున్న డెలివరీ బాయ్.. అందులో ఏముందంటే?

**బెంగళూరులోని జొమాటో డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఒకరు.. ఫుడ్ ఆర్డర్‌లో చేతితో రాసిన నోట్‌ను వేసి, సమ్మర్ ఇంటర్న్‌షిప్ కోసం తనను తాను ప్రపోజ్ చేసుకున్నాడు. ఇది ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతోంది. నెటిజన్లు ఇతడు చేసిన పనిని తెగ ప్రశంసిస్తున్నారు.**

డెలివరీ ఎగ్జిక్యూటివ్ చేతితో రాసిన నోట్‌లో.. తాను మార్కెటింగ్ ఇంటర్న్‌షిప్ కోసం వెతుకుతున్న కాలేజీ విద్యార్థిగా పేర్కొన్నాడు. నోట్ అందుకున్న వారు తగిన అవకాశం ఉంటే తనను సంప్రదించాలని ఫోన్ నెంబర్ కూడా అందులో రాశాడు. ఈ నోట్‌కు సంబంధించిన ఫోటోను.. బెంగళూరులో సొల్యూషన్స్ ఇంజనీర్ నిఖిల్ లింక్డ్‌ఇన్‌లో షేర్ చేశారు.

జొమాటో డెలివరీ ఏజెంట్ ధైర్యం చూసి నిఖిల్ ఆశ్చర్యపోయాడు. డెలివరీలు చేసే హడావిడిలో కూడా తాను.. చేతితో రాసిన నోట్ ద్వారా ఉద్యోగావకాశం కోసం సెర్చ్ చేయడం గొప్ప విషయం అని అన్నారు. డెలివరీ ఏజెంట్ మీద చాలా గౌరవం ఏర్పడిందని మరొకరు కామెంట్ చేయగా. తాను ఆశించినట్లే.. ఇంటర్న్‌షిప్ లభిస్తుందని ఇంకొకరు అన్నారు. ఇలా ఎవరికి తోచిన రీతిలో వారు కామెంట్స్ చేస్తున్నారు.

# యస్ బ్యాంక్ అదుర్స్.. 63% పెరిగిన లాభం

**ముంబై:** ప్రైవేటు రంగ యస్ బ్యాంక్ గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. మొండి బకాయిలకు కేటాయింపులు (ప్రొవిజన్లు) గణనీయంగా తగ్గడంతో మార్చి క్వార్టర్‌లో నికర లాభం 63% వృద్ధితో రూ.738 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.9,355 కోట్లకు చేరింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆదాయం రూ. 9,016 కోట్లుగా ఉంది.

తాజా క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 5.7% పెరిగి రూ.2,276 కోట్లకు చేరింది. బ్యాంక్ డిపాజిట్ వృద్ధి 6.8%గా ఉంది. వడ్డీయేతర ఆదాయం 10.9% పెరిగి రూ.1,739 కోట్లకు చేరింది. మొత్తం ప్రొవిజన్లు 32.5% తగ్గి రూ.318 కోట్లకు పరిమితమయ్యాయి. స్థూల మొండి బకాయిల నిష్పత్తి 1.6% తగ్గి రూ.3,935 కోట్లకు పరిమితమైంది. నికర మొండి బకాయిలు 0.3 శాతం క్షీణించాయి. రుణ డిపాజిట్ నిష్పత్తి 88% నుంచి 86.5 శాతానికి దిగివచ్చింది. క్యాపిటల్ అడెక్వసీ 15.6 శాతానికి చేరింది.

"స్థూల ఆర్థిక వ్యవస్థ పరిస్థితుల దృష్ట్యా రుణ వృద్ధి 12-15 శాతం లక్ష్యంగా పెట్టుకున్నాము. రుణ వృద్ధి కంటే డిపాజిట్ల వృద్ధి అధికంగా ఉంటుంది. సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేటు 2% తగ్గించడంతో మూడు శాతానికి పరిమితమైంది. దీని ప్రభావం కాసా (కరెంట్ అకౌంట్ సేవింగ్స్ అకౌంట్)పై ఉండదు. క్రెడిట్ కార్డుల పోర్ట్‌ఫోలియోలో ఒత్తిళ్లు కొనసాగుతున్నాయి. రాబోయే 2-3 త్రైమాసికాల్లో క్రెడిట్ వ్యయం దిగివస్తుంది. 2025 ఆర్థిక సంవత్సరంలో 37 బ్రాంచులు ఏర్పాటు చేశాము. వచ్చే ఐదేళ్లలో ఏడాదికి కొత్తగా 80 శాఖలు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాము'' అని యస్ బ్యాంకు ఎండీ, సీఈవో ప్రశాంత్ కుమార్ వెల్లడించారు.

# షాంగైలో గోల్డ్ ఏటీఎం.. ఫీచర్స్ తెలిస్తే షాక్ అవ్వాల్సిందే?

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా దేశం ఆవిష్కరణల్లో వేగంగా దూసుకెళ్తోంది. నూతన సాంకేతికతను ఉపయోగించుకుని అద్భుతాలు సృష్టిస్తోంది. ఈ క్రమంలోనే దేశంలోనే అతి పెద్ద నగరమైన షాంగైలోని ఓ షాపింగ్ మాల్‌లో గోల్డ్ ఏటీఎం ఏర్పాటు చేశారు. ఇది నగరంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి బంగారం ఏటీఎం. ప్రపంచవ్యాప్తంగా బంగారం ధర పెరుగుతున్న కొద్దీ, ఈ చిన్న యంత్రం ప్రజలకు ఆకర్షణగా నిలుస్తోందని స్థానిక కథనాలు పేర్కొన్నాయి. ఈ ఏటీఎం వద్ద నిరంతరం జనసమూహం ఉంటుందని తెలిపాయి. ఏటీఎం స్పెషలైజేషన్ విషయాని కొస్తే ఇది 1200 డిగ్రీల సెల్సియస్ వద్ద బంగారాన్ని కరిగింది దాని స్వచ్ఛతను తెలియజేస్తుంది. అంతేగాక ప్రత్యక్ష ధరను సైతం చూపిస్తుంది. అలాగే బంగారం కొనుగోలు చేసిన తర్వాత బ్యాంకు నుంచి డబ్బును సైతం ట్రాన్స్ ఫర్ చేయొచ్చు. ఈ ఏటీఎం ఫీచర్స్ చూసి వినియోగదారులు ఎంతో ఆసక్తి కనబర్చుతున్నట్టు తెలుస్తోంది. దీని నుంచి బంగారం లావాదేవీలు చేయడం కూడా చాలా సులభం. ముందుగా ఈ యంత్రం బంగారాన్ని తూకం వేస్తుంది. అనంతరం 99.99 శాతం గోల్డ్ స్వచ్ఛమైనదా కాదా అని తనిఖీ చేస్తుంది. ఆ తర్వాత షాంఘై గోల్డ్ ఎక్స్ఛేంజ్ ప్రత్యక్ష రేటు ప్రకారం డబ్బును లెక్కిస్తుంది. ప్రస్తుతం ఈ గోల్డ్ ఏటీఎంపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఎక్స్ లో ఓ వినియోగదారుడు దీనిపై స్పందిస్తూ.. వావ్ త్వరలో భారత్ లోనూ గోల్డ్ ఏటీఎంలను చూస్తామని ఆశిస్తున్నాం అని పేర్కొన్నారు. అలాగే మరొక నెటిజన్ సరదాగా వ్యాఖ్యానిస్తూ.. ఇది భారత్ కు వస్తే గొప్ప ఉత్పత్తి అవుతుంది, కానీ చైన్ స్నాచర్లకు సైతం సంతోషం కలుగుతుందని సెటైర్ వేశారు.

# ఈరోజు పెట్రోల్, డీజిల్ ధరలు ఇలా..

**దేశంలోని వివిధ నగరాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు నేడు (ఏప్రిల్ 20) స్థిరంగా ఉన్నాయి. అయితే రాష్ట్రాల విలువ ఆధారిత పన్ను (VAT), రవాణా ఖర్చులు, స్థానిక నిబంధనల కారణంగా నగరాల మధ్య ధరలలో వ్యత్యాసం కనిపిస్తుంది. ఈ ధరలను ప్రతిరోజు ఉదయం 6 గంటలకు డైనమిక్ ఇంధన ధరల నిర్ణయ విధానం ప్రకారం సవరిస్తారు. ఇది 2017 జూన్ నుండి అమలులో ఉంది. ఈ విధానం అంతర్జాతీయ చమురు ధరలు, రూపాయి-డాలర్ మారకం రేటు, ఎక్సైజ్ డ్యూటీ, డీలర్ కమిషన్ వంటి అంశాల ఆధారంగా ధరలను నిర్ణయిస్తుంది.**




**ప్రధాన నగరాల్లో పెట్రోల్ ధరలు**
దేశంలోని ప్రధాన నగరాల్లో పెట్రోల్ ధరల్లో నిన్నటి పోలిస్తే ఎలాంటి మార్పు లేదు. గత ఐదు నెలలుగా ఈ ధరలు స్థిరంగా ఉన్నాయి. ఏప్రిల్ 20న పెట్రోల్ ధర లీటరుకు ఏయే నగరంలో ఎంత ఉందో ఇక్కడ తెలుసుకుందాం.

- హైదరాబాద్: రూ.107.46
- విజయవాడ: రూ.109.74
- న్యూ ఢిల్లీ: రూ.94.77
- ముంబై: రూ.103.50
- కోల్‌కతా: రూ.105.01
- చెన్నై: రూ.101.03
- బెంగళూరు: రూ.102.98
- అహ్మదాబాద్: రూ.94.58
- లక్నో: రూ.94.58
- పాట్నా: రూ.106.11

**డీజిల్ ధరలు**
డీజిల్ ధరలు కూడా రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య విభిన్నంగా ఉంటాయి. ఏప్రిల్ 20న డీజిల్ ధరలు లీటర్‌కు ఇలా ఉన్నాయి.

- హైదరాబాద్: రూ.95.70
- విజయవాడ: రూ.97.57
- న్యూ ఢిల్లీ: రూ.87.67
- ముంబై: రూ.90.03
- కోల్‌కతా: రూ.91.82
- చెన్నై: రూ.92.39
- బెంగళూరు: రూ.90.99
- అహ్మదాబాద్: రూ.90.17

## నా జీవితంలో మరచిపోలేని బహుమతి ఇదే: మోహన్ లాల్ ఎమోషనల్ పోస్ట్

**మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ఇటీవల ఎల్2 ఎంపురాన్ మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. గతంలో సూపర్ హిట్‌గా నిలిచిన లూసిఫర్‌కు సీక్వెల్‌గా ఈ సినిమాను తెరకెక్కించారు. సలార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీగానే వసూళ్లు రాబట్టింది. ఈ ఏడాది మలయాళ ఇండస్ట్రీలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఎల్2 ఎంపురాన్ నిలిచింది.**

అయితే సినిమాల పరంగా సూపర్ స్టార్ మోహన్‌లాల్ దక్షిణాదితో పాటు నార్త్‌లోనూ ఫ్యాన్స్ ఉన్నారు. అలా సినిమా హీరోలకు అభిమానులు ఉండడం సహజం. కానీ అదే సినిమా హీరో మరొకరికి అభిమాని అయితే ఎలా ఉంటుంది. సినీ పరిశ్రమలో స్టార్‌డమ్ సొంతం చేసుకున్న మోహన్ లాల్ కూడా ఓ వ్యక్తికి వీరాభిమాని. అతనెవరో కాదు.. ప్రముఖ ఫుట్‌బాల్ ప్లేయర్.. అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి. అతనంటే మోహన్‌లాల్‌కు విపరీతమైన అభిమానం. అంతలా అభిమానించే లియోనాల్ మెస్సి.. మోహన్‌లాల్‌కు అరుదైన కానుకను పంపించారు. తాను సిగ్నేచర్ చేసిన జెర్సీని మోహన్‌లాల్‌కు బహుమతిగా పంపారు. ఈ విషయాన్ని మోహన్ లాల్ తన ట్విటర్ ద్వారా పంచుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ ఎమోషనల్ నోట్ రాసుకొచ్చారు.



మోహన్‌లాల్ ట్విటర్‌లో రాస్తూ..' జీవితంలోని కొన్ని క్షణాలు మాటల్లో చెప్పలేనివిగా అనిపిస్తాయి. అవీ ఎప్పటికీ మనతోనే ఉంటాయి. ఈ రోజు నేను అలాంటి క్షణాలనే అనుభవించాను. నా బహుమతిని చూసినప్పుడు నా హృదయం ఒక్కసారిగా ఆనందంతో నిండిపోయింది. లెజెండ్ లియోనెల్ మెస్సీ సంతకం చేసిన జెర్సీ... అందులో నా పేరు, అతని చేతులతో రాసినది. మెస్సీని చాలా కాలంగా మెస్సీని అభిమానించే వ్యక్తికి ఇది నిజంగా ప్రత్యేకమైనదే. డాక్టర్ రాజీవ్ మంగొట్టిల్, రాజేష్ ఫిలిప్ అనే ఇద్దరు ప్రియమైన స్నేహితుల లేకుండా ఈ అపురూపమైన క్షణం సాధ్యమయ్యేది కాదు. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నా జీవితంలో అన్నింటికంటే మరపురాని ఈ బహుమతికి ధన్యవాదాలు' అని



## ఆ డైరెక్టర్‌తో తిరుమలకు సమంత.. మరోసారి మొదలైన చర్చ!

**టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న సమంత.. ప్రస్తుతం నిర్మాతగా అభిమానుల ముందుకు రానుంది. ఆమె నిర్మించిన తాజా చిత్రం శుభం త్వరలోనే ప్రేక్షకులను అలరించనుంది. ఈ సినిమాలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియా కొంతం ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 9న విడుదల కానుంది.**

ఇక సినిమాల సంగతి పక్కనపెడితే గత కొద్ది కాలంగా వ్యక్తిగత విషయాలతొనే వార్తల్లో నిలుస్తోంది. సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తర్వాత.. సమంతపై పెద్దఎత్తున రూమర్స్ వినిపిస్తున్నాయి. ఆ సిరీస్ డైరెక్టర్లలో ఒకరైన రాజ్ నిడిమోరుతో సామ్ డేటింగ్‌లో ఉందంటూ చాలాసార్లు కథనాలొచ్చాయి. ఇటీవల పికిల్ బాల్ లీగ్‌లోనూ వీరిద్దరూ జంటగా కనిపించారు. ఆ తర్వాత కోలీవుడ్‌లో బీహైండ్‌వుడ్స్ అవార్డ్స్ ఫంక్షన్‌లో రాజ్ నిడిమోరు, సమంత సందడి చేశారు. కొంతకాలంగా ఈవెంట్స్‌లో కనిపించడంతో ఆ రూమర్స్‌కు మరింత బలం చేకూరింది. ఈ నేపథ్యంలో ఈ జంట త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని టాక్ కూడా వినిపిస్తోంది.

ఈ వార్తల నేపథ్యంలో సమంత, రాజ్ నిడిమోరు రిలేషన్‌షిప్ మరోసారి తెరపైకి వచ్చింది. వీరిద్దరు కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం సమంత, రాజ్ నిడిమోరు సంప్రదాయ దుస్తుల్లో తిరుమల వెంకటేశ్వరస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరలయ్యాయి. దీంతో మరోసారి వీరిద్దరి డేటింగ్‌పై చర్చ మొదలైంది. అయితే ఈ రూమర్స్‌పై ఇప్పటి వరకు సమంత, రాజ్ ఒక్కసారి కూడా స్పందించలేదు. వీరిలో ఎవరో ఒకరు క్లారిటీ ఇస్తే కానీ ఇప్పట్లో రూమర్స్ ఆగేలా కనిపించడం లేదు.

కాగా.. రాజ్ డైరెక్షన్‌లో సామ్ 'సిటాడెల్: హనీ బన్నీ, 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' (2021) అనే రెండు ప్రాజెక్ట్‌ల్లో నటించింది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'రక్త బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లోనూ సమంత నటిస్తోంది. సమంత చివరిసారిగా వరుణ్ ధావన్‌తో కలిసి నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్‌లో కనిపించింది.



## ఆ వయస్సు వరకే అవకాశాలు దియా మీర్జా ఆసక్తికర కామెంట్స్

**బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ దియా మీర్జా ఆసక్తికర కామెంట్స్ చేసింది. సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ల అవకాశాలపై ఆమె మాట్లాడింది. పెళ్లి తర్వాత సినిమాల్లో అవకాశాలు రావడం తగ్గిపోతాయని వెల్లడించింది. పెళ్లి తర్వాత తన కెరీర్ ఎలా ప్రభావితం అయిందో వివరించింది. దాదాపు 25 ఏళ్లపాటు ఇండస్ట్రీలో కొనసాగిన దియా మీర్జా ఇటీవల నాదానియాన్ మూవీలో ఓ పాత్రలో కనిపించింది. ఈ చిత్రంలో ఇబ్రహీమ్ అలీ ఖాన్‌కు తల్లిపాత్రలో నటించింది. అయితే ప్రస్తుతం ఓటీటీల వల్ల కొత్తగా అవకాశాలు వస్తున్నాయని పేర్కొంది. తాను నటించిన 2019 వెబ్ సిరీస్‌ను మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె హీరోయిన్ల అవకాశాలపై స్పందించారు.**

దియా మీర్జా మాట్లాడుతూ..' నిజ జీవితంలో మాతృత్వాన్ని స్వీకరించిన తర్వాత సినిమాల్లో ఎంపిక చేసే విధానం మారింది. గత ఐదేళ్లలో నేను నా కొడుకు పుట్టడానికి ముందు.. పుట్టిన తరువాత నేను చేసిన ప్రతి క్యారెక్టర్ అతను చూడాలని కోరుకునే ప్రాజెక్ట్‌లు. కథలను ఎంచుకోవడంలో నా ప్రాధాన్యత అలానే ఉంటుంది. హీరోయిన్లకు వయస్సు, పెళ్లి, మాతృత్వం తర్వాత అవకాశాలపై ప్రభావం ఉంటుంది. నా వయస్సు కారణంగా ఛాన్సులు రావడం లేదని నమ్మడం ప్రారంభించా. చాలా సినీ ఇండస్ట్రీల్లోనూ ఇదే జరుగుతుంది. దాదాపు 35 నుంచి 48 వయస్సు మధ్యలో హీరోయిన్‌గా అవకాశాలు కష్టమే. ఆ తర్వాత మీరు తల్లి, సోదరి పాత్రలు చేయడం ప్రారంభిస్తారు. కానీ ఓటీటీ వల్ల మహిళలకు అవకాశాలను పెంచిందని' తెలిపింది.

దియా మాట్లాడుతూ..' ఈ రోజుల్లో సోషల్ మీడియా ఫాలోయింగ్‌పై విచారం వ్యక్తం చేసింది. సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం ఒక సరి కొత్త అర్థంలేని పని జరుగుతోంది. సోషల్ మీడియాలో వ్యక్తులకున్న పాపులారిటీ ఆధారంగా చాలా మంది నటీనటుల ఎంపిక జరుగుతోంది. ఇది చాలా అన్యాయం. కొందరు అత్యద్భుతమైన ప్రతిభావంతులు సోషల్ మీడియాలో తమ వాయిస్‌ని బయటపెట్టడానికి ఇష్టపడరు. కానీ దాని అర్థం వారికి అర్హత లేదని కాదు. ప్రస్తుతం ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కొత్త సంస్కృతి" అని ఆమె అన్నారు

## అమ్మాయిలూ మీ కోసం కష్టపడండి ఫ్యామిలీ కోసం..: అనసూయ

**చిన్నితెర మీద యాంకర్‌గా అనసూయ ప్రయాణం ఓ స్పెషల్. అటు చిన్నితెర మీదా ఇటు వెండితెర మీద కూడా గుర్తుంచుకోదగిన పాత్రలు పోషించే అవకాశం ఆమెకు మాత్రమే దక్కిందని చెప్పవచ్చు. కేవలం యాంకర్, యాక్ట్రెస్‌గా మాత్రమే కాకుండా సోషల్ మీడియా సెలబ్రిటీగా కూడా అనసూయ ముందంజలో ఉంది. యాక్టింగ్, యాంకరింగ్ టాలెంట్‌తో పాటు తనదైన శైలిలో గ్లామర్ కూడా పండించడంతో ఆమె తరచుగా వార్తల్లో వ్యక్తి అవుతుంటారనేది వాస్తవం.**

ప్రస్తుతం మిడిల్ ఏజ్‌లో ఉన్న ఈ బ్యూటీ మధ్యలో కాస్త ఓవర్ వెయిట్ అనిపించినా.. ఇప్పుడు మళ్లీ మంచి శరీరాకృతి సాధించి అభిమానులను ఆకర్షిస్తోంది. అంతేకాదు వారితో ఆమె తరచుగా తన ఫిట్‌నెస్ జర్నీ విశేషాలు కూడా పంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె అమ్మాయిలకు అందించిన ఓ సందేశం ఆసక్తికరంగా ఉంది.

మహిళలు, ఉద్యోగినులు అయినా గృహిణులు అయినా, తమ కోసం తాము టైమ్ కేటాయించుకోలేక ఒత్తిడికి గురవుతారు; వారి షెడ్యూల్ ఉదయం నుంచి రాత్రి వరకు ఫుల్ అయిపోయి ఉంటుంది. పిల్లలని స్కూల్‌కి రెడీ చేయడంతో మొదలుపెడితే.. భర్తలు అత్తమామలకు టిఫిన్లు ప్యాక్ చేయడం, ఇంటిని శుభ్రం చేయడం, ఆపై నేరుగా వంట లేదా ఇతర పనుల్లోకి తలమునకలవడం...తో రోజు గడచిపోతుంటుంది. ఇటువంటి దినచర్య మధ్య, తరచుగా చాలా మంది మహిళలకు ఫిట్‌నెస్ అనేది ఓ టైమ్ వేస్ట్ పనిలా అనిపిస్తుంది.

ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ యాంకర్ అనసూయ భరద్వాజ్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంది. ఆమె మహిళలకు కొన్ని ఆచరణీయ సలహాలను కూడా అందించింది కూడా ఒకప్పుడు జిమ్‌కి వెళ్లడానికి ఆసక్తి ఉండేది కాదని ఇప్పుడు జిమ్ వర్కువట్స్ ప్రారంభించిన తర్వాత తన ఆలోచన పూర్తిగా మారిపోయిందని చెప్పిందామె. ఇన్ స్ట్రాగామ్‌లో తన జిమ్ వర్కౌట్‌ల వీడియోను పోస్ట్ చేస్తూ, అనసూయ ఇలా వివరించింది



## హీరోయిన్ బేబీ బంప్.. ఇక్కడే ట్విస్ట్

**అప్పుడెప్పుడో వచ్చిన 'బద్రి' సినిమా గుర్తుందా? అందులో హీరోయిన్‌గా చేసిన అమీషా పటేల్.. తర్వాత తెలుగులో పెద్దగా నటించలేదు. పూర్తిగా బాలీవుడ్ కి షిఫ్ట్ అయిపోయింది. ఇప్పడు చాలావరకు అవకాశాలు తగ్గిపోయాయి. అలాంటిది ఇప్పడు ఈమెపై ప్రెగ్నెన్సీ రూమర్స్ వస్తున్నాయి. కానీ ఇక్కడ చిన్న మెలిక ఉంది.**

49 ఏళ్ల అమీషా పటేల్ చివరగా గతేడాది 'తౌబా ఇన్ స్టాలో మాత్రం ఎప్పుడూ గ్లామరస్ ఫొటోలు పోస్ట్ చేస్తూ ఉంటుంది. అలాంటిది రీసెంట్ గా గ్రీన్ కలర్ బికినీతో ఫొటో పోస్ట్ చేసింది.

ఇందులో ఈమె పొట్ట కాస్త ఎత్తుగా ఉండటంతో అమీషా పటేల్ ప్రెగ్నెన్సీతో ఉందా అని మాట్లాడుకుంటున్నారు. ఇప్పటివరకు పెళ్లి చేసుకోకుండా ఉండిపోయిన ఈమె.. ప్రస్తుతం ఎవరితోనైనా రిలేషన్ లో ఉందా అని అనుకుంటున్నారు. అయితే ఇదంతా కూడా పబ్లిసిటీ స్టంట్ ఏమో అనిపిస్తుంది.

ఎందుకంటే ఈ ఫొటో పోస్ట్ చేయడానికి ముందు కూడా కొన్ని ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసింది. అందులో లేని బేబీ బంప్.. బికినీ ఫొటోలో కనిపించడం చూస్తుంటే సోషల్ మీడియాలో తన గురించి మాట్లాడుకోవాలని అమీషా చేసిన పనిలా అనిపిస్తుంది. మరి నిజమేంటనేది ఆమె చెబితే తప్ప తెలియదు.



# చెలరేగిన రోహిత్, సూర్య... చెన్నైపై ముంబై విజయం

**ఓవైపు జట్టుకు వరుస ఓటములు.. మరోవైపు రోహిత్ శర్మ వైఫల్యం.. ఈ సీజన్లో ముంబయి అభిమానుల బాధ అంతా ఇంతా కాదు. కానీ ఇప్పుడు ముంబయి దూసుకెళ్తోంది.**



ఓవైపు జట్టుకు వరుస ఓటములు.. మరోవైపు రోహిత్ శర్మ వైఫల్యం.. ఈ సీజన్లో ముంబయి అభిమానుల బాధ అంతా ఇంతా కాదు. కానీ ఇప్పుడు ముంబయి దూసుకెళ్తోంది. రోహిత్ కూడా చెలరేగిపోతున్నాడు. మ్యాచ్ మ్యాచ్‌కూ మెరుగవుతున్న హిట్‌మ్యాన్ ఆదివారం భారీ ఇన్నింగ్స్‌తో అభిమానులను ఉర్రూతలూగించాడు. సూర్యకుమార్ సైతం రెచ్చిపోవడంతో వాంఖడేలో చెన్నై సూపర్‌కింగ్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించి నాలుగో విజయాన్ని ఖాతాలో వేసుకుంది ముంబయి ఇండియన్స్. 8 మ్యాచ్‌ల్లో సీఎస్కేకు ఇది ఆరో పరాజయం.

ఐపీఎల్ 18లో ఆలస్యంగా జోరందుకున్న ముంబయి.. హ్యాట్రిక్ విజయం సాధించింది. ఆదివారం బంతితో చెన్నైని కట్టడి చేసి.. బ్యాట్‌తో మెరుపులు మెరిపించి ఘనంగా గెలిచింది. మొదట చెన్నై 5 వికెట్లకు 176 పరుగులు చేసింది. శివమ్ దూబె (50; 32 బంతుల్లో 2×4, 4×6), రవీంద్ర జడేజా (53 నాటౌట్; 35 బంతుల్లో 4×4, 2×6) రాణించారు. అరంగేట్రంలోనే ఆయుష్ మాత్రే (32; 15 బంతుల్లో 4×4, 2×6) సత్తా చాటాడు. బుమ్రా (2/25) ఆకట్టుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్‌శర్మ (76 నాటౌట్; 45 బంతుల్లో 4×4, 6×6), సూర్యకుమార్ (68 నాటౌట్; 30 బంతుల్లో 6×4, 5×6) చెలరేగడంతో ముంబయి 15.4 ఓవర్లలో ఒక వికెటే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

రోహిత్, సూర్య ధనాధన్: ఛేదనలో రోహిత్ శర్మ ఆటే హైలైట్. ఈ సీజన్లో ఒక్కసారి మాత్రమే 20పైన స్కోరు చేసిన రోహిత్ చెన్నైపై చెలరేగిపోయాడు. తన శైలిలో షాట్లు ఆడి ముంబయిని విజయపథంలో నడిపించాడు. ఆరంభం నుంచి సిక్స్‌లతో అదరగొట్టిన రోహిత్.. ఖలీల్ వేసిన మూడో ఓవర్లో సిక్స్, 2 ఫోర్లతో 14 పరుగులు రాబట్టాడు. మరో ఓపెనర్ రికిల్‌టన్ (24; 19 బంతుల్లో 3×4, 1×6) కూడా ధాటిగా ఆడడంతో పవర్‌ప్లే ఆఖరికి ముంబయి 62/0తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. రికిల్‌టన్‌ను జడేజా ఔట్ చేసినా.. రోహిత్, సూర్యకుమార్ జోరు కొనసాగించారు. ఈ క్రమంలోనే రోహిత్ 33 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. మరోవైపు సూర్య అదిరే షాట్లు ఆడాడు. నూర్ అహ్మద్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో స్కోరుబోర్డు పరుగులెత్తించాడు. 26 బంతుల్లోనే సూర్య అర్ధసెంచరీ పూర్తయింది. 50 తర్వాత లభించిన రెండు జీవనదానాలను ఉపయోగించుకున్న రోహిత్ మరింత చెలరేగాడు. సూర్య కూడా ఎక్కడా తగ్గలేదు. ఇద్దరూ పోటీ పడి సిక్సర్లు బాదడంతో ముంబయి 26 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది.

నిలిచిన దూబె, జడేజా: అంతకుముందు చెన్నై ఇన్నింగ్స్ నెమ్మదిగా మొదలైంది. రచిన్ రవీంద్ర (5), షేక్ రషీద్ (19; 20 బంతుల్లో 1×4) దూకుడుగా ఆడలేకపోవడంతో 3 ఓవర్లకు 16 పరుగులే చేయగలిగింది. మూడో ఓవర్లో చెన్నైకి తొలి బౌండరీ లభించింది. రచిన్‌ను అశ్వని కుమార్ ఔట్ చేయడంతో చెన్నైకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ స్థితిలో 17 ఏళ్ల ఆయుష్ మాత్రే అదరగొట్టాడు. అశ్వని కుమార్ బౌలింగ్‌లో అతడు వరుసగా 4, 6, 6 అందుకున్నాడు. మణికట్టు సాయంతో మిడ్ వికెట్ మీదగా మెరుపు సిక్స్ కొట్టాడు. దీంతో సీఎస్కే ఇన్నింగ్స్‌కు ఊపు వచ్చింది. ఆయుష్ బాదుతున్నా... ఇంకోవైపు రషీద్ సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. ఓవర్ తేడాతో ఆయుష్, రషీద్ ఔటైపోవడంతో ఆ జట్టు 8 ఓవర్లకు 63/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో జడేజా, శివమ్ దూబె నిలిచారు. ఆరంభంలో వీళ్లిద్దరూ షాట్లు ఆడలేక తీవ్రంగా ఇబ్బంది పడగా.. 11 ఓవర్లకు స్కోరు 73 పరుగులే. అయితే కుదురుకున్నాక ఇద్దరూ దూకుడు పెంచారు. ముఖ్యంగా దూబె రెచ్చిపోయాడు. అశ్వనికుమార్ వేసిన 16వ ఓవర్లో 3 సిక్స్‌లు, ఫోర్ బాదడంతో 24 పరుగులొచ్చాయి. 16 ఓవర్లకు 142/3తో చెన్నై భారీ స్కోరుతో ఇన్నింగ్స్ ముగించేలా కనిపించింది. దూబెతో పాటు ధోని (4) వెనుదిరగడంతో అనుకున్నదానికంటే తక్కువ స్కోరే చేయగలిగింది. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో సిక్స్, ఫోర్ కొట్టిన జడేజా.. అర్ధసెంచరీ అందుకోవడమే కాక స్కోరు 170 దాటించాడు.

చెన్నై ఇన్నింగ్స్: రషీద్ (స్టంప్డ్) రికిల్‌టన్ (బి) శాంట్నర్ 19; రచిన్ (సి) రికిల్‌టన్ (బి) అశ్వనికుమార్ 5; ఆయుష్ మాత్రే (సి) శాంట్నర్ (బి) దీపక్ 32; జడేజా నాటౌట్ 53; శివమ్ దూబె (సి) జాక్స్ (బి) బుమ్రా 50; ధోని (సి) తిలక్ (బి) బుమ్రా 4; ఒవర్టన్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 176; వికెట్ల పతనం: 116, 257, 363, 4142. 5156; బౌలింగ్: దీపక్ చాహర్ 40321; బౌల్ట్ 40430; అశ్వని కుమార్ 20421; శాంట్నర్ 30141; బుమ్రా 40252; జాక్స్ 1040; హార్దిక్ 20130

ముంబయి ఇన్నింగ్స్: రికిల్‌టన్ (సి) ఆయుష్ మాత్రే (బి) జడేజా 24; రోహిత్ నాటౌట్ 76; సూర్యకుమార్ నాటౌట్ 68; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (15.4 ఓవర్లలో వికెట్ నష్టానికి) 177; వికెట్ల పతనం: 163; బౌలింగ్: ఖలీల్ 20240; ఒవర్టన్ 20290; అశ్విన్ 40250; జడేజా 30281; నూర్ అహ్మద్ 30360; పతిరన 1.40340



# దుమ్ములేపిన కోహ్లీ... పంజాబ్ ను చిత్తు చేసిన బెంగళూరు

**ఈ సీజన్‌లో సొంతగడ్డ ఆవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. చిన్నస్వామిలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఆ జట్టు... బయట మాత్రం వరుసగా అయిదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది.**



### బెంగళూరు ఖాతాలో అయిదో విజయం
### పంజాబ్ పరాజయం
### రాణించిన పడిక్కల్, కృనాల్, సుయశ్
### ముల్లన్‌పుర్

ఈ సీజన్‌లో సొంతగడ్డ ఆవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. చిన్నస్వామిలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఆ జట్టు... బయట మాత్రం వరుసగా అయిదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఆల్‌రౌండ్ ఆధిపత్యంతో పంజాబ్ కింగ్స్‌ను మట్టికరిపిస్తూ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది ఆర్సీబీ. స్పిన్నర్లు కృనాల్, సుయశ్ సూపర్ బౌలింగ్‌తో పంజాబ్‌ను కట్టడి చేసిన బెంగళూరు.. కోహ్లి, పడిక్కల్ అదిరే బ్యాటింగ్‌తో సాఫీగా లక్ష్యాన్ని ఛేదించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అదరగొట్టింది. గత మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది. ఆదివారం బెంగళూరు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట పంజాబ్ 6 వికెట్ల నష్టానికి 157 పరుగులే చేయగలిగింది. కృనాల్ (2/25), సుయశ్ శర్మ (2/26), భువనేశ్వర్ (0/26) ఆ జట్టుకు కళ్లెం వేశారు. ప్రభ్‌సిమ్రన్ (33; 17 బంతుల్లో 5×4, 1×6), శశాంక్ సింగ్ (31 నాటౌట్; 33 బంతుల్లో 1×4) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (73 నాటౌట్; 54 బంతుల్లో 7×4, 1×6), పడిక్కల్ (61; 35 బంతుల్లో 5×4, 4×6) మెరవడంతో లక్ష్యాన్ని ఆర్సీబీ 18.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది.

కోహ్లి కడవరకూ..: బెంగళూరు ఛేదనలో ఇన్నింగ్స్‌కు కోహ్లి వెన్నెముకగా నిలవగా.. ధనాధన్ ఇన్నింగ్స్‌తో పడిక్కల్ ఆ జట్టు పనిని తేలిక చేశాడు. స్వల్ప స్కోరును కాపాడుకోవడానికి పంజాబ్ అద్భుతమేమీ చేయలేదు. తొలి ఓవర్లోనే సాల్ట్‌ను ఔట్ చేసినా ఆ జట్టుకు సంతోషించడానికేమీ లేకపోయింది. కోహ్లి, పడిక్కల్ సాధికారిక బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఛేదనలో దిట్ట అయిన కోహ్లి ముచ్చటైన షాట్లతో అలరించాడు. యాన్సెన్ ఓవర్లో రెండు బంతులను బౌండరీ దాటించాడు. మరోవైపు పడిక్కల్ మరింత ధాటిగా ఆడాడు. ఫోర్లు, సిక్స్‌లతో వేగంగా పరుగులు రాబట్టాడు. ఇక కోహ్లి.. లక్ష్యం అందుబాటులోనే ఉండడంతో అవసరానికి తగినట్లు ఆడాడు. పవర్‌ప్లే లోపు 5 బౌండరీలు కొట్టిన అతడు.. ఆ తర్వాత ఎదుర్కొన్న 24 బంతుల్లో ఒక్క బౌండరీ కొట్టకపోవడం గమనార్హం. అతడు స్ట్రైక్ రొటేట్ చేస్తూ.. చెలరేగుతున్న పడిక్కల్‌కు సహకరించాడు. 30 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న పడిక్కల్.. హర్‌ప్రీత్ బ్రార్ (1/27) వేసిన 13వ ఓవర్లో ఔట్ కావడంతో రెండో వికెట్ భాగస్వామ్యానికి 103 పరుగుల వద్ద తెరపడింది. అయితే చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన కోహ్లి.. ఎలాంటి తడబాటుకు అవకాశం ఇవ్వకుండా రజత్ పాటీదార్ (12), జితేశ్ శర్మ (11 నాటౌట్)తో కలిసి ఆర్సీబీని విజయ తీరాలకు చేర్చాడు. 43 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న కోహ్లి.. ఆ తర్వాత రెండు ఫోర్లు, ఓ సిక్స్ కొట్టాడు.

పంజాబ్ కట్టడి: బెంగళూరు స్పిన్నర్లు కృనాల్ పాండ్య, సుయశ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పంజాబ్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. కాస్త మందకొడిగా ఉన్న పిచ్‌పై ఆర్సీబీ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. నిజానికి పంజాబ్ ఆరంభం బాగానే ఉంది. ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్ (22; 15 బంతుల్లో 3×4, 2×6) చెలరేగడంతో ఆ జట్టు 4 ఓవర్లలో 41/0తో నిలిచింది. కానీ ఆ తర్వాత ఇన్నింగ్స్ గతి తప్పింది. కృనాల్ రంగ ప్రవేశంతో పరిస్థితి మారిపోయింది. అయిదో ఓవర్లో ప్రియాంశ్‌ను ఔట్ చేసిన అతడు.. తన తర్వాతి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్‌ను కూడా వెనక్కి పంపాడు. కెప్టెన్ శ్రేయస్ (6)ను షెఫర్డ్ ఎక్కువ సేపు నిలువనివ్వలేదు. సమన్వయ లోపంతో 9వ ఓవర్లో నేహాల్ వధేరా (5) రనౌట్ కావడంతో పంజాబ్ 76/4తో చిక్కుల్లో పడింది. ఇంగ్లిస్ (29), శశాంక్ సింగ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. 13 ఓవర్లలో 111/4తో నిలిచింది పంజాబ్. కానీ ఆర్సీబీ బౌలర్లు చక్కని బౌలింగ్‌తో ఆ జట్టును కట్టి పడేశారు. పంజాబ్ ఆఖరి ఏడు ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 46 పరుగులే చేయగలిగింది. సుయశ్ 14వ ఓవర్లో ఇంగ్లిస్, స్టాయినిస్ (1) లను ఔట్ చేయడం ద్వారా పంజాబ్‌ను గట్టిదెబ్బతీశాడు. శశాంక్, యాన్సెన్ (25 నాటౌట్) ఆఖరి వరకు క్రీజులో ఉన్నా.. బ్యాట్ ఝుళిపించలేకపోయారు. చివరి 4 ఓవర్లలో పంజాబ్‌కు 28 పరుగులు మాత్రమే వచ్చాయి. భువనేశ్వర్, హేజిల్‌వుడ్.. బ్యాటర్లను స్వేచ్ఛగా ఆడనివ్వలేదు.

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ ఆర్య (సి) డేవిడ్ (బి) కృనాల్ 22; ప్రభ్‌సిమ్రన్ (సి) డేవిడ్ (బి) కృనాల్ 33; శ్రేయస్ అయ్యర్ (సి) కృనాల్ (బి) షెఫర్డ్ 6; ఇంగ్లిస్ (బి) సుయశ్ 29; నేహాల్ వధేరా రనౌట్ 5; శశాంక్ సింగ్ నాటౌట్ 31; స్టాయినిస్ (బి) సుయశ్ 1; యాన్సెన్ నాటౌట్ 25; ఎక్స్‌ట్రాలు 5 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 157; వికెట్ల పతనం: 142, 262, 368, 476, 5112, 6114; బౌలింగ్: భువనేశ్వర్ 40260; యశ్ దయాల్ 20220; హేజిల్‌వుడ్ 40390; కృనాల్ పాండ్య 40252; రొమారియో షెఫర్డ్ 20181; సుయశ్ 40262

బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) ఇంగ్లిస్ (బి) అర్ష్‌దీప్ 1; కోహ్లి నాటౌట్ 73; పడిక్కల్ (సి) వధేరా (బి) హర్‌ప్రీత్ 61; రజత్ (సి) యాన్సెన్ (బి) చాహల్ 12; జితేశ్ నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం: (18.5 ఓవర్లలో 3 వికెట్లకు) 159; వికెట్ల పతనం: 16, 2109, 3143; బౌలింగ్: అర్ష్‌దీప్ 30261; బార్ట్‌లెట్ 30280; హర్‌ప్రీత్ బ్రార్ 40271; యాన్సెన్ 30200; చాహల్ 40361; స్టాయినిస్ 10130; నేహాల్ వధేరా 0.5090



# హైకోర్టును ఆశ్రయిస్తా

**ఉప్పల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు తన పేరును తొలగించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయిస్తానని భారత జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజహరుద్దీన్ తెలిపాడు.**

ఉప్పల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు తన పేరును తొలగించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయిస్తానని భారత జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజహరుద్దీన్ తెలిపాడు. హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య నిర్ణయం పట్ల అజహర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. "కచ్చితంగా చట్టపరమైన సహాయం తీసుకుంటా. ఈ ఉత్తర్వులు నిలిపివేయాలని హైకోర్టును ఆశ్రయిస్తా. భారత మాజీ కెప్టెన్ పేరు తొలగించమని చెప్పడం సిగ్గుచేటు. అంబుడ్స్‌మన్ పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ముగిసింది. ఆయన పదవీకాలన్ని పొడిగించలేదు. వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో మాత్రమే ఈ నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుంది. ఇప్పటి వరకు ఏజీఎం జరగలేదు. తమ జీవితంలో ఎప్పుడూ బ్యాట్ పట్టుకోని హెచ్‌సీఏలోని కొంతమంది నావైపు వేలెత్తి చూపిస్తున్నారు" అంటూ అజహర్ వ్యాఖ్యానించాడు. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజహర్ ఉన్నప్పుడు నార్త్ స్టాండ్‌కు తన పేరును పెట్టుకోవడం సరికాదని.. ఇది పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకి వస్తుందంటూ జస్టిస్ ఈశ్వరయ్య తీర్పు వెలువరించారు. స్టాండ్‌కు అజహర్ పేరును తొలగించడంతో పాటు మ్యాచ్ టిక్కెట్లపైనా ఆ ప్రస్తావన లేకుండా చర్యలు తీసుకోవాలంటూ హెచ్‌సీఏను ఆదేశించారు.

# మ్యాక్స్‌వెల్, లివింగ్‌స్టోన్‌లను ఏకిపారేసిన సెహ్వాగ్.. హాలిడే కోసమే ఐపీఎల్ ఆడతారంటూ ఆగ్రహం

ఐపీఎల్ 18లో మ్యాక్స్‌వెల్ (పంజాబ్ కింగ్స్), లివింగ్‌స్టోన్ (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు) ఫామ్ లేమితో తంటాలు పడుతున్నారు. పేలవ ప్రదర్శన చేస్తున్న వారిపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శలు గుప్పించాడు. పరుగులు చేయాలనే ఆకలి, ఉద్దేశం వారికి లేదన్నాడు. హాలిడే కోసం భారత్‌కు వచ్చినట్టు వారి తీరు ఉందని విమర్శించాడు. 'మ్యాక్స్‌వెల్, లివింగ్‌స్టోన్‌లలో ఆకలి తీరిందని అనుకుంటున్నా. వారు హాలిడే కోసం మాత్రం ఇక్కడికి వచ్చారు. సరదాగా గడిపారు. తిరిగి వెళ్లిపోతారు. జట్టు కోసం పోరాడాలనే తపన వారిలో కనిపించడం లేదు.' అంటూ కీలక వ్యాఖ్యలు చేశాడు. పంజాబ్‌కు ఆడుతున్న మ్యాక్స్‌వెల్ ఆరు మ్యాచ్‌ల్లో కేవలం 41 రన్సే చేశాడు. మరోవైపు, లివింగ్‌స్టోన్ బెంగళూరు తరపున 7 మ్యాచ్‌ల్లో 87 పరుగులు చేశాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఆర్సీబీ, పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్లు మ్యాక్స్‌వెల్, లివింగ్‌స్టోన్‌లను తుది జట్ల నుంచి తప్పించాయి.

